# 3

# భవిష్యద్వాణి

"త్రవమ అనంతరం కాశ్మీర సామ్రాజ్యలక్ష్మి ఎవ్వరికి కైవసం కాగలదో అని బాలాదిత్య సార్వభౌముల ఆంతర్యంలో ప్రబల మయిన జిజ్ఞాస చెలరేగుతున్నది: మీ ఇరువురిలోను ఎవ్వరయినా ఈ విషయం సావకాశంగా పర్యాలోచించి నిస్సందేహంగా నిర్ణ యించి చెప్పగలరా?"

వృద్ధమంత్రి దేవశర్మ నెమ్మదిగా లేచి నిలిచి, కొలువు కూటంలో కూర్చున్న జ్యోతిషవిద్వాంసుల నిద్దరిని సూటిగా ప్రశ్నిం చాడు. దానితో వా రిద్దరు వేళ్ళతో మీనమేషాలు లెక్కిస్తూ దీర్ఘాలోచ నలో పడ్డారు. ఆ ఇరువురిలోను నాగేశ్వర భట్టారకుడు కాశ్మీరాస్థాన జ్యోతిష విద్వాంసుడు. రెండవవాడు మేధావి. నాగేశ్వర భట్టార కుడు ఆ ప్రశ్న ఎందుకు పుట్టిందో క్షణంలో గ్రహించుకున్నాడు. పదహారేళ్ళ ప్రాయంలో, బాలాదిత్య చక్రవర్తి ఒకేఒక కుమారుని శరీరంలో ఇటీవల ప్రమాదకరమయిన క్షయరుగ్మత ప్రవేశించి పీడి స్తున్నది. చక్రవర్తి తీవ్ర జిజ్ఞాస కది ఒక్కటే ప్రధాన కారణం. అదే ఆందోళనవల్ల జ్యోతిషంలో కాశ్మీరంలో అంతట విశేషంగా పేరుప్రతిష్ఠలు గడించుకున్న మేధావి నానాడు ప్రత్యేకించి కొలువు కూటానికి పిలిపించడం జరిగిందనికూడా నాగేశ్వర భట్టారకుడు పసి కట్టి వేశాడు. కనక బాగా జాగ్రత్తపడి మెళకువతో వ్యవహరించక పోతే మున్ముందు తన పదవికే ముప్పు రావచ్చునని భయపడ్డాడు.

మరికొన్ని నిమేషాలపాటు తీవ్రంగా ఆలోచించి, రవంత తటపటాయిస్తూ లేచి నిలిచి, సమక్షంలో స్వర్ణసింహాసనంపై సమాసీనుడయిన చక్రవర్తినుద్దేశించి అత్యంత వినయంతో శిర స్సల్లిన వంచి విన్నవించాడు.

"సార్వభౌమా, నే నిటీవల తిరిగి తమ జాతకచక్రము, యువ సార్వభౌముల జాతకకుండలి నిశితంగా పరిశీలించాను. ఎన్నెన్ని విధాల పరీక్షించినా, ఆ రెండు జాతకాలలోను ఎక్కడ నా కిటువంటి జిజ్ఞాసకే ఆస్కారం కనబడడంలేదు. నే నిదే విషయం తమ కింతకుమునుపే నివేదించుకున్నాను. అంతకన్న నే నిప్పుడు ప్రత్యేకించి విన్నవించదగినదేది లేదని మనవి."

రెండవ జ్యోతిర్విద్వాంసుడు మేధావి నాగేశ్వరభట్టారకుని కన్న వయస్సులో బాగా పిన్న. అయినా నిర్భయంగా లేచి నిలిచి దేవశర్మ నుద్దేశించి ఖంగుమని మారుమోగుతున్న కంఠస్వరంతో ప్రసంగించాడు.

"మహావిద్వాంసులు నాగేశ్వరభట్టారకులు సార్వభౌముల ప్రశ్నమీద అంత నిష్కర్షగా, నిస్సందేహంగా సెలవిచ్చిన పిమ్మట వారి జోస్యానికి కేవలం వ్యతిరేకంగా విన్నవించడం సభామర్యాద కాదేమోనని సంకోచిస్తున్నాను."

"దానికేమి? 'ముఖే ముఖే సరస్వతీ' అన్నారు పెద్దలు! మీకు తోచిన ఫలితమేదో ప్రభువర్యుల సమక్షంలో నిస్సంకోచంగా వెల్లడించవచ్చును!"

వృద్ధమంత్రి నాగేశ్వరభట్టారకునివైపు ఓరగా చూచి మేధావి కెంతో ధైర్యం కలిగించాడు. ఆ భరవసాతో అతడు నిర్భయంగా నొక్కి వక్కాణించాడు.

"ప్రాచీనకాలంనుంచి గోనందవంశీయుల భుజస్కంధాల్పై సుఖంగా విశ్రమించిన కాశ్మీర సామ్రాజ్యలక్ష్మి ఇక సార్వభౌముల అనంతరం తప్పక వేరొక రాజవంశీయుల కైవసం కాగలదు! చక్రవర్తి జాతకచక్రము, యువసార్వభౌముల జాతకకుండలి క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట నాకు మరి తిరుగు లేనట్టుగా గోచ

రించిన దిది. ప్రభువర్యుల కెంతో అప్రియమయినా, ఈ భవిష్యద్వాణి ఉన్నది ఉన్నట్టుగా వెల్లడించకతప్పకపోయినందుకు నన్ను విశేషించి మన్నించవలసిందని వేడుకుంటున్నాను.''

ఆ ప్రసంగంతో కొలువుకూటం యావత్తు ఒక్కమారుగా పిడుగు మొత్తినట్టు నిర్ఘాంతపడింది! చక్రవర్తి కిరువైపుల నిలిచి వింజామరలు వీస్తున్న చామరగ్రాహిణుల హస్తాలొక్కమారుగా నిమేషకాలం నిలిచిపోయాయి. అప్పటికే పశ్చిమాద్రివైపు తిరిగిన సూర్యదేవుని బంగారుకిరణాలా చామరాలపై నిలిచి తళతళ మెరిశాయి.

ఆ ప్రకారంగా తన జోస్యాని కడ్డుచెప్పిన మేధావిపై నాగే శ్వరభట్టారకుని కెంతయినా ఆగ్రహం కలిగింది. రెండు మూడు క్షణాలపాటు అతని కిక ఊపిరే ఆడలేదు! అయినా అతి కష్టంమీద ఆ క్రోధావేశం నిగ్రహించుకుని ఉప్పొంగుతున్న అక్కసుతో అతని జ్యోతిష ఫలితంమీద చంద్రనిప్పులే చెరిగిపోశాడు.

''ఇదిగో, తిరిగి నా జ్యోతిష ఫలితం నే నింకొక్కమారు నిష్కర్షగా విన్నవించుకుంటున్నాను. సార్వభౌముల అనంతరం తప్పక యువసార్వభౌములే కాశ్మీరాధీశ్వరులై చిరకాలం జేగీయ మానంగా పరిపాలించగలరు! ఒకవేళ నా జోస్యం తప్పినపక్షంలో వెనువెంటనే నే నీ ఆస్థాన పండితపదవి విసర్జించి, ఇదిగో, ఈ నా రతనాల గండపెండేరం స్వయంగా మేధావి విద్వాంసుల పాదాని కలంకరించి, సాష్టాంగ నమస్కారం సమర్పించగలను!''

తన జోస్యం సత్కృత్తుగా ఎప్పుడయినా ఒకప్పుడు తప్పు తున్న సంగతి నాగేశ్వరభట్టారకునికి తెలియకపోలేదు. అందుచేత అతని కిప్పుడు తాను చెప్పిన ఫలితం ఒకవేళ తప్పితే తప్పవచ్చు నేమో అన్న అనుమానం కలగకపోలేదు. ఏది ఏమయినా ఎప్పుడో బాలాదిత్య చక్రవర్తి అనంతరకాలంలో జరగబోయే సంఘటనమీద, తన ఏలిక కనిష్ఠమయిన పద్ధతిలో ఫలితం చెప్పకూడదని నాగేశ్వర భట్టారకుడు నిర్ణయించుకున్నాడు. కనక మరింత అహంకారావేశంతో

అదే ఫలితం నిష్కర్షగా వెల్లడిస్తూ, మొత్తంమీద కాశ్మీరాస్థానంలో తన ఉనికిమీదనే పెద్ద పందెంవేసి గట్టిగా గొంతెత్తి గర్జించాడు.

ఆ హుంకరింపుతో మేధావి బాగా ఇరుకులో పడిపోయాడు. అయినా ఆవంతయినా చలించలేదు.

"సార్వభౌమా! నా భవిష్యద్వాణి తప్పక ఫలించి తీరుతుంది! దీని కిక తిరుగులేదు. ఇచ్చకంకోసం మంచి ఫలితం చెప్పి మర్యాదగా బయటపడడం నా కెన్నడు అలవాటులేదు! కేవలం నీతమయిన శాస్త్రదృష్టితోనే నే నీ ఫలితం విన్నవించాను. నా జోస్యం ఫలించినా నాగేశ్వరభట్టారకుల ఆస్థాన పండిత పదవిగాని, గండపెండేరంకాని నేనాశించడంలేదు. నేను కేవలం జ్యోతిషశాస్త్రం గౌరవం నిలబెట్టడంకోసమే తమ దర్శనం చేసుకున్నాను."

అటుపిమ్మట దేవశర్మ రవంతసే పాలోచించి, మేధావివైపు చూచి ప్రశ్నించాడు.

"సరే, దీనికేమిగాని, యువసార్వభౌములు జన్మించినప్పటి నుండి ఏదో ఒక రోగం పట్టుకుని పీడిస్తూనే ఉన్నది. ఇలాగ ఉండగా ఇటీవల క్షయరుగ్మత ఒకటి ప్రవేశించింది. దీనినిగురించి సార్వభౌము లెంతో వ్యథపడుతున్నారు. మరి యువసార్వభౌముల కెప్పటికి పరిపూర్ణారోగ్యం కలుగుతుంది?"

మేధావి క్షణకాలం మౌనంవహించి, చక్రవర్తికి దోసిలికట్టి విన్నవించాడు.

"సార్వభౌమా!తమ మొట్టమొదటి ప్రశ్నమీద నే నీ విషయమై కొంత పరోక్షంగా నా అభిప్రాయం విన్నవించే ఉన్నాను. అసలే తమ కెంతో మనఃఖేదం కలిగించే ఫలితం చెప్పవలసివచ్చిందని ఇంతకు మునుపే నే నెంతో వ్యథపడుతున్నాను. తిరిగి నా నోట అటువంటి మాటే పలికించ నేల? దీనికి సరిఅయిన ప్రతిసమాధానం చెప్పవలసినవారు న్యాయ్యంగా నాగేశ్వరభట్టారకులే కదా!"

మరునిమేషంలోనే ఆస్థానవిద్వాంసుడు తటాలున లేచి నిలుచున్నాడు.

"సార్వభౌమా! యువసార్వభౌముల కిక నాలుగు మాసాల

లోనే తప్పక పరిపూర్ణారోగ్యం చేకూరి తీరుతుంది! దీనికోసం మీ రొకించు కయినా మథన పడ నక్కర లేదు! నా మాట కిక తిరుగు లేదు....!"

దానిమీద మేధావి అవుననిగాని, కాదనిగాని తన అభిప్రాయం వెలువరించలేదు! నాగేశ్వరభట్టారకుని ప్రసంగం వినీ విననట్టు మాట్లాడకూరుకున్నాడు.

ఆ నిశ్చల మౌనంతో తన కుమారుని విషయమై చక్రవర్తి ముఖంలో మరింత మథన పేరుకున్నదని ఆస్థాన విదూషకుడు పర్వత భట్టు పసికట్టివేశాడు. అందువల్ల సార్వభౌముని కేదోవిధంగా ఉల్లాసం కలిగించాలని నిశ్చయించుకుని చిరునవ్వు చిందిస్తూ జ్యోతిషంమీద తన సందేహం వ్యంగ్యంగా వెల్లడించాడు.

"కాశ్మీరసార్వభౌమా! జ్యోతిశ్శాస్త్రంలో వీరిద్దరు మీసుమిగి లిన విద్వాంసులే! అయితే తమ జాతకచక్రము, యువసార్వభౌముల జాతకచక్రము పరిశీలించి ఇద్దరు కేవలం పరస్పర విరుద్ధములయిన ఫలితాలు చెప్పడంవల్ల అసలు నాకీ జ్యోతిషశాస్త్రంలోనే ఏదో గొప్ప లోపం ఉన్నట్టు గోచరిస్తున్నది!"

ఆ వ్యంగ్యాధిక్షేపంతో నాగేశ్వరభట్టారకునికి వెన్నుపోటు పొడిచినట్టయింది! వెనువెంటనే తిరిగి కస్సుమన్నాడు.

"చేతా వాతా కాని చెట్లకింది జోస్యులవల్లనే జ్యోతిషాని కిటు వంటి అప్రతిష్ఠ కలుగుతున్నది! అంతేగాని ఆ శాస్త్రంలో ఎటువంటి లోపము లేదు! తలపాగా చుట్టుకోలేక తల వంకర అన్నట్టున్నది పర్వతభట్టు ప్రసంగం ధోరణి!!"

ఆ ఎత్తిపొడుపు మేధావి, పర్వతభట్టుల గుండెలలో ఒకే మారు సునిశితమయిన శూలంలా సూటిగా నాటుకున్నది. అయినా మేధావి అతికష్టంమీద తన ఆవేశం నిగ్రహించుకుని ఔనౌనన్నట్టు వ్యంగ్యంగా శిరస్సు పంకించి, చిరునవ్వుతో మాట్లాడ కూరు కున్నాడు. కాని నాగేశ్వరభట్టారకుడు తన మాట కాదని కొట్టివేసి వేళాకోళం చేసినందువల్ల పర్వతభట్టు మరి మౌనం వహించలేక

పోయాడు. క్షణంలో లేచి నిలిచి, ఆస్థాన విద్వాంసునివైపు తిరిగి, దోసిలికట్టి, తెచ్చిపెట్టుకున్న విపరీత వినయంతో విన్నవించాడు.

"చాలాకాలంనించి జ్యోతిష విషయంలో నన్నొక్క పెద్ద సందేహం పట్టుకుని పీడిస్తున్నది. మానవుల జీవితం అంతా తు చ తప్పకుండా జాతకాలలో రాసిపెట్టినట్టే జరిగిపోతున్నదా? లేక వారి కేమయినా స్వాతంత్ర్యం అన్నది ఉన్నదా?"

నాగేశ్వరభట్టారకుడు క్షణకాలమయినా తడుముకోకుండా ఆ ప్రశ్నమీద తన నిర్ణయం వెల్లడించాడు.

"దీనిలో సందేహాని కెక్కడ అవకాశంలేదు! అంతా అక్షరాల జాతకచక్రాలలో లిఖించినట్టే జరిగిపోతున్నది. అంతేగాని మరి మనుష్యుల కెక్కడ స్వాతంత్ర్యం లేనేలేదు."

పర్వతభట్టు ప్రశ్నలో ఏదో పెద్ద మెలిక ఉంది తీరుతుందని మేధావి కనురెప్పపాటుకాలంలో కనిపెట్టేశాడు. ఆస్థానపండితునిపై ఏదో పెద్ద బెడద విరుచుకుపడబోతున్నదనికూడా అతనికి ఇట్టే బోధపడిపోయింది. అంతలోనే విదూషకు డందుకున్నాడు.

"అయితే ఆయా వ్యక్తు లెవ్వరయినా దుష్కార్యాలు చేసినప్పుడు వారిని శిక్షించడం కేవలం దురన్యాయం కదా? వా రా విధంగా కానిపనులు చేసితీరవలసినట్టు ఆయా జాతకాలలో అంతకుమునుపే నిర్ణయం జరిగిపోయిందికదా? పాపం, వారందరు కేవలం అస్వతంత్రులే కదా?"

నాగేశ్వరభట్టారకుని కేమనడానికి పాలుపోలేదు. నీళ్ళు నములుతూ ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు నటిస్తూ అలాగే దిగాలుపడి కూర్చుండిపోయాడు. విదూషకుడు పర్వతభట్టు మొత్తం జ్యోతిష శాస్త్రానికే పెద్ద ఎసరు పెట్టి వ్యంగ్యంగా వెక్కిరించి వేళాకోళం చేస్తున్నాడని మేధావి గ్రహించుకున్నాడు. మరుక్షణంలోనే లేచి నిలిచి అలతి నగవుతో అడ్డుకున్నాడు.

"పర్వతభట్టారకులు వేసిన ప్రశ్న చాలా గట్టిదే! సరిఅయినదే! అయితే ఆయా దుష్కృత్యాలు చేసిన వారికి ఆయా శిక్షలు విధించవలసినదని ధర్మం ప్రభువర్యుల జాతకాలలో నిర్దేశింపబడిఉన్నది

అదేవిధంగా ఆయా శిక్ష అనుభవించవలసిన తీరు ఆయా అపరాధుల జాతకాలలో నిర్ణీతమయి ఉన్నది. ఈ ఫలితాలలో న్యాయాన్యాయాలు కూడా కలిసివచ్చాయి. అంతే! ఇందుచేత ఈ శిక్షలు విధించడంలోగాని, అనుభవించడంలో గాని దురన్యాయ్య మేమి లేదు. ఇంతే కాదు. పర్వతభట్టారకు లీ విధంగా వ్యంగ్యంగా జ్యోతిషాన్ని దుయ్యబట్టడము, నా సమాధానంతో వారినోరు కట్టుబడిపోవడముకూడా మా ఇద్దరి జాతకాలలోను ఇంతకుమునుపే ఏర్పడిఉన్నదని మనవి."

కత్తికోతవంటి ఎత్తిపొడుపుతో వాడిఅయిన ఆ ప్రతిసమాధానం విని మేధావి సందరు అంతర్యాలలో అభినందించకుండా ఉండలేకపోయారు. సార్వభౌమ దేవశర్మల పెదవులపై చిరునవ్వులు మొలకెత్తాయి. అంతేకాదు. చామరగ్రాహిణు లిరువురి అధరాల మీదకూడా దరహసితా లొక్కమారుగా చెంగలించాయి. కాని విదూషకునికిమాత్రం దెక్కుపట్టినంత పనిఅయింది! అయినా అతడు తన పట్టుదల విడిచిపెట్టలేదు! అత్యంత వినయంతో చక్రవర్తికి దోసిలి కట్టి నిలిచి తిరిగి విన్నవించాడు.

"సార్వభౌమా! మేధావి భట్టారకులు చాలా చక్కగా చమత్కరిస్తూ నా సందేహం పూర్తిగా తొలగించి, ఈ విషయమై నా నోటికి గట్టి తాళం వేసిన మాట యథార్థమే! అంగీకరిస్తున్నాను. అయితే ఈ విద్వాంసులిద్దరు ఎప్పుడో భవిష్యత్కాలంలో జరగబోయే సంఘటనపై కేవలం పరస్పర విరుద్ధంగా తమ తమ ఫలితాలు సెలవిచ్చారు! అయినా ఇద్దరు ఏకీభవించి ఇక జ్యోతిషంవంటి శాస్త్రమే లేదని గొంతులెత్తి ఘోషిస్తున్నారు! లోపా లేవయినా ఉంటే ఆయా జోస్యులవే అని వాదిస్తున్నారు! ఇందుచేత వర్తమానానికి సంబంధించిన ఒక ప్రశ్నవేసి ఇప్పుడే వీరిద్దరి శక్తి సామర్థ్యాలు ఎటువంటివో గ్రహించాలని కుతూహల పడుతున్నాను. దీనికి తమ అనుమతి అర్థిస్తున్నాను."

చక్రవర్తి శిరస్సు కొంచెం పంకించి దాని కంగీకరించాడు. పులిమీద పుట్రలాగ ఈ విదూషకు దెక్కడినించి విరుచుకుపడ్డాడని

జ్యోతిషవిద్వాంసు లిద్దరు ఆంతర్యాలలో బాగా ఆందోళనపడ్డారు. అయినా గభీర ప్రసన్నముఖాలతో అతని పరీక్షకోసం నిరీక్షించారు.

పర్వతభట్టు ఒంటిమీద కప్పుకున్న శాలువాలోనికి చెయ్యి పోనిచ్చి, అంగీలో ఏదో కొంతసేపు వెతికి పట్టుకున్నట్టు అభిన యించి, పిడికిలి గట్టిగా బిగించి పైకెత్తి జ్యోతిషవిద్వాంసు లిద్దరి వైపు చూసి ప్రశ్నించాడు.

"ఇదిగో, ఈ పిడికిలిలో ఉన్నదేదో మీ రిద్దరు వేర్వేరుగా సెలవియ్యండి! చూదాము!"

నాగేశ్వరభట్టారకుడు రెండుమూడు నిమిషాలపా టాలో చించాడు.

"వరాహమిహిరులు, పరాశరులు, జైమిని మొదలయిన జ్యోతిశ్శాస్త్రకర్తల పద్ధతులన్నీ పరిశీలించిచూడగా మీ గుప్పిట ఉన్నది వట్టిశూన్యమే అని తేలిపోతున్నది! సందేహం లేదు! అంటే మీ పిడికిలిలో ఉన్నది రవంత గాలిమాత్రమే అంతకన్న వేరేమి లేదు!"

అంతలోనే విదూషకుడు మేధావివైపు చూసి ప్రశ్నార్థకంగా ప్రత్యుత్తరంకోసం నిరీక్షించాడు.

అతడు తటాలున లేచి నిలిచి, "మీ పిడికిలిలో ఉన్నది ఒకే ఒక్క బంగారు దీనారం!" అన్నాడు.

పర్వతభట్టు కలకల నవ్వి తన పిడికిలి అలాగే బిగించి ఉంచాడు.

"మేధావుల జోస్యం పూర్తిగా తప్పింది. నాగేశ్వరభట్టారకు లన్నది అక్షరాల ఫలించింది!"

విదూషకు డదేక్షణంలో తన పిడికిలి తెరిచాడు. దానిలో ఒకే ఒక పైడి దీనారం తళతళకాంతులతో సాక్షాత్కరించింది! విదూషకుడు దానివైపు చూచి, మరి తన కన్నులే నమ్మలేక నిలువునా నిర్ఘాంతపడ్డాడు.

"సార్వభౌమా, పిడికిలి బిగించేముందు దానిలో ఏమి లేదు! కనకనే నాగేశ్వరభట్టారకు లన్నది అక్షరాల యథార్థమని వెల్ల

డించాను. ఇంతలోనే ఈ పైడిదీనారం పిడికిలిలో ఎలాగ ప్రవే శించిందో నాకేమి అవగాహన కావడంలేదు!"

ఆ విచిత్ర సంఘటన తిలకించి సభాస్తారు అందరు కేవలం చిత్రప్రతిమలే అయినారు!

"మీరెంతో అదృష్టవంతులు! తలవనితలంపుగా అకస్మాత్తుగా మీరొక పైడిదీనారం గడించుకున్నారు! ఆస్థానానికి మీ రీనాడు నక్కని తొక్కివచ్చినట్టున్నారే!"

మేధావి చిరునవ్వుల రువ్వులతో చమత్కరించాడు. నాగేశ్వరభట్టారకునికి తల కొట్టివేసినట్టయింది! అయినా అతడు తన ఓటమి అంగీకరించలేదు! మరింత అక్కసుప్తితో మేధావిమీద కాల కూట విషమే వెళ్ళగక్కాడు.

"కాశ్మీరాధీశ్వరా! ఇది ఏదో నీచమంత్రోపాసనంవల్ల లభించిన జ్యోతిషశక్తి! అంతేగాని, జ్యోతిష శాస్త్రానికి, ఈ విధంగా ఫలితం చెప్పడానికి సంబంధమేమిలేదు! లేకపోతే విదూషకుల పిడికిలిలో ఇంతకు మునుపు లేని పైడిదీనారం ఇప్పు డకస్మాత్తుగా ఎలాగ ప్రవేశిస్తుంది? ఇది ఏదో ఇంద్రజాలవిద్యే అని నా గట్టి నమ్మిక. అపైన తమ చిత్తం!"

ఆస్థాన విద్వాంసు డా తీరులో వెనకనించి వెన్నుపోటు పొడిచేసరికి మేధావికి తన జ్యోతిష ఫలితం శాస్త్రీయంగా సమర్థించుకోవలిసిన ఆవశ్యకత కలిగింది.

కేరళదేశంలో సుప్రసిద్ధమయిన ఒక ప్రశ్న జ్యోతిషశాస్త్ర గ్రంథం ప్రకారం తా నా విధంగా ఫలితం చెప్పినట్టు సయుక్తికంగా సమర్థించుకున్నాడు. ఆయా గ్రహాల ఉనికివల్ల ఏర్పడ్డ ఫలితం నిరూపించాడు. అందువల్లనే తా నా విధంగా ఫలితం చెప్పినట్లు వివరించాడు. అంతేగాని ఇంద్రజాలవిద్యనుగూర్చిగాని దానికి సంబంధించిన మంత్రతంత్రాలను గూర్చిగాని తా నింతకు మునుపెన్నడు విననేలేదని వెల్లడించాడు. ఒక్కొక్కప్పుడు తన వాక్శుద్ధి వల్ల అటువంటి అత్యద్భుత సంఘటనలు కొన్ని జరిగినట్లు సోదాహరణంగా పేర్కొని సమర్థించాడు.

అతని వాగ్ధాటికి, శాస్త్రపాండిత్యానికి చక్రవర్తి, వృద్ధమంత్రి అత్యాశ్చర్యభరితులయినారు. అది గమనించిన నాగేశ్వరభట్టారకుని నోరు కట్టుబడిపోయింది: బాలాదిత్య సార్వభౌముని సగౌరవ దృష్టి మేధావిపై ప్రసరించింది.

"విద్వన్మణీ! వ్యక్తి విధి చేతులలో వట్టి కీలుబొమ్మేనా? లేక అతని కేమయినా స్వాతంత్ర్యం అన్నది ఉన్నదా?"

"యథార్థదృష్టితో పరిశీలిస్తే వ్యక్తి సర్వస్వతంత్రుడు. తన భవిష్యత్తుయావత్తుతానే స్వయంగా మలుచుకోగలడు. తమ తపశ్శక్తి వల్ల, ధర్మకార్యాచరణలవల్ల జాతకాలలో చెడు ఫలితాలు కొన్ని శుభ ఫలితాలుగా మార్చుకున్న మహనీయులను కొందరిని నే నెరుగుదును. అయితే అటువంటివారి సంఖ్య చాలా స్వల్పం. కాని ఒక్క మనవి. ఈ విధమయిన సర్వస్వతంత్రతకూడా ఆ దైవ నిర్ణయమే అని జ్యోతిష విద్వాంసులు కొందరు వివదించవచ్చును. ఇది మిక్కిలి జటిలమయిన ప్రశ్న. అయినా వ్యక్తి సర్వస్వతంత్రుడే అని నా సిద్ధాంతము."

ఆ విధమయిన ప్రత్యుత్తరం చక్రవర్తి కెంతో ఆనందం కలిగించింది. స్వయంగా తానై సింహాసనం మీదనుండి దిగివచ్చి వేయి న్నూటపదారు పైడిదీనారాలతోబాటు, నూతన వస్త్రాలు, దుశ్శాలువలు మేధావికి బహూకరించాడు. ఆ తీరులో మేధావి చక్రవర్తి బహూకృతి స్వీకరించిన పిదప నాగేశ్వరభట్టారకునికి అతనిని గౌరవించి అభినందించక తప్పలేదు. అటుపిమ్మట మరికొంతసేపటికి సార్వభౌముని కొలువు ముగిసింది.

*　　*　　*

క్రీస్తుశకం 553లో కాశ్మీర సింహాసనంపై పట్టాభిషిక్తుడయిన బాలాదిత్య సార్వభౌముని కొకే ఒక కుమారునితోబాటు ఒక కుమార్తె కూడా ఉన్నది. ఆమె పేరు అనంగలేఖ. కుమారునికన్న రెండు మూడేళ్ళు పెద్ద.

వాస్తవానికి బాలాదిత్యునికి జ్యోతిషంపై బొత్తిగా నమ్మిక లేదు. ఏదో ప్రాచీన సాంప్రదాయప్రకారం మాత్రమే నాగేశ్వర

భట్టారకునికి కాశ్మీర సంస్థానంలో పండిత పదవి ప్రసాదించాడు. అంతే....

అయితే, అసలే చిన్ననాటినించి ఏవేవో రోగాలతో దుర్బల శరీరుడయిన తన కుమారుని కిటీవల దారుణమయిన క్షయరుగ్మత సోకగానే అత్యంత ప్రాచీనకాలంనించి కాశ్మీరం పరిపాలించిన గోనందవంశం తనతో విచ్ఛిన్నమయిపోగలదేమో అని ఆ చక్రవర్తి సనుక్షణము విపరీత భీతి పట్టుకుని వేధించింది.

అదే ఆందోళనతో ప్రత్యేకించి మేధావిని తన కొలువుకూటానికి పిలిపించి, వృద్ధ మంత్రిద్వారా తన సందేహాన్ని గురించి పరోక్షంగా ప్రశ్నింపజేయించాడు. అయితే అందువల్ల కూడా బాలాదిత్యుని మనస్సులో వేధిస్తున్న మథన తొలగలేదు.

నాలుగు నెలలలోగానే తన కుమారునికి తప్పక పరిపూర్ణారోగ్యం చేకూరగలదని నాగేశ్వరభట్టారకుడు తన ఆస్థాన పండిత పదవిమీదనే పందెంవేసి గొంతెత్తి గర్జించాడు. కాని ఏమి లాభం? మేధావి తనతోనే గోనందవంశం పరిసమాప్తమయిపోగలదన్నట్టు పరోక్షంగా హెచ్చరించాడు.

ఒక్కొక్కప్పుడు ఇటువంటి పరస్పర ఫలితాలు జ్యోతిష వేత్తలు వెల్లడిస్తూండడంవల్లనే కాశ్మీరాధిపతికి ఆ శాస్త్రంపై నిరసనభావం కలిగింది. నాగేశ్వరభట్టారకుడు చక్రవర్తి జాతకచక్రం పరీక్షించి అనేక పర్యాయాలు చెప్పిన ఫలితాలు అక్షరాల ఫలించక పోలేదు. అయితే సకృత్తుగా అవి తప్పడంకూడా జరిగింది. కనకనే బాలాదిత్యునికి ఆ శాస్త్రంపై అంతటి అపనమ్మకం కలిగింది.

పైగా అత డెల్లప్పుడు స్వకీయ శక్తిసామర్థ్యాలవల్లనే సమస్తము సాధించవచ్చునని దృఢంగా విశ్వసించిన ధీరవ్యక్తి. అదే ధైర్యంతో కాశ్మీరం పరిసరంలో ఉన్న రాజ్యాలు కొన్ని జయించి సార్వభౌమ బిరుదం గడించుకున్న మహనీయ పరాక్రమశాలి.

చక్రవర్తి ఒకవేళ తాను తలపెట్టిన వేవయినా ఫలించనప్పుడు అనూహ్యమయిన కారణమేదో ఏర్పడి ఉండవచ్చునని భావించేవాడు. అంతేగాని దైవంమీద అత డెన్నడు ఆధారపడలేదు. పట్టి దుర్బల

మనస్కులు మాత్రమే విధివిలాసాలమీద, జాతకచక్రాలమీద ఆధార పడుతున్నారని అతని గట్టి నమ్మిక.

అదే గుండెదిటవుతో శాయశక్తులా ప్రయత్నించి తన కుమారుని రుగ్మత రూపుమాపివెయ్యాలని కాశ్మీర సార్వభౌము డొక దృఢదీక్ష స్వీకరించాడు. ఆయా ప్రాంతాలనుండి సుప్రసిద్ధు లయిన రాజవైద్యుల నెందరినో పిలిపించి చికిత్స చేయించాడు.

అలాగలాగ మరికొంతకాలం గడిచిన పిమ్మట సార్వభౌముని కుమారుని క్షయరోగం చాలావరకు నయమయింది. నాగేశ్వర భట్టా రకు డన్నట్టుగానే సరిగా నాలుగు నెలలలోనే క్షయ చాలావరకు పూర్తిగా తగ్గిపోయినదని రాజవైద్యు లందరు ఏకగ్రీవంగా నిర్ణయించారు.

ఆ పరిస్థితిలో చక్రవర్తికి తిరిగి జోస్యంపై కొంత నమ్మిక ఏర్పడింది. భయంకరమయిన ఆపద లెదురుపడినప్పుడు, ఎంతెంతటి ధైర్యవంతులకయినా, ప్రజ్ఞావంతులకయినా ఒక్కొక్కప్పుడు దైవంమీద, జోస్యంవంటి విద్యలమీద అంతకుమును పెన్నడు లేని నమ్మిక కలగడంలో ఆశ్చర్యంలేదు। బాలాదిత్యుని కప్పటికి అదే విధమయిన మానసికస్థితి ఏర్పడింది.

అంతలోనే మరికొన్ని వారాలయినా గడవక మునుపే యువ సార్వభౌముని పరిస్థితి బాగా క్షీణించడం ప్రారంభించింది. పైపైకి అత డారోగ్యంగా కనిపించినా శరీరం నానాటికి చిక్కి శల్య మయింది. రాజవైద్యులందరు యావచ్ఛక్తి వినియోగించి చికిత్స చేశారు. కాని అకస్మాత్తుగా తిరగబెట్టిన క్షయరోగం మరి తగ్గలేదు. క్రమక్రమంగా మరింత ప్రమాదకరంగా పరిణమించింది. చక్రవర్తి కుమారు డొకనాటి అర్ధరాత్రివేళ ఆకస్మాత్తుగా పరలోకం చేరు కున్నాడు.

ఆ తీవ్రాఘాతంలో చక్రవర్తి మరికొన్నాళ్ళవరకు తేరుకో లేదు. నాగేశ్వరభట్టారకుడు ప్రభువు సన్నిధికి పోయి పరామర్శించి జ్యోతిషశాస్త్రంలో తనఅజ్ఞానంతోబాటు ఓటమిఅంగీకరించి మన్నించ

ఫలిసిందని వేడుకున్నాడు. ఆ మరునాడే మరి ఎవ్వరికి తెలియకుండా తనకుటుంబంతోటాటు వారణాసికి తరలిపోయాడు.

బాలాదిత్యుని కటుపిమ్మట గోనందవంశం తనతో విచ్ఛిన్న మయిపోగలదని, మేధావి చెప్పిన జోస్యం ఫలించగలదేమో అని విపరీతమయిన అనుమానం కలిగింది. కాని అంతమాత్రం చేత అత డధైర్యపడలేదు. తన శక్తిసామర్థ్యాలన్ని విని యోగించి ఆ ఫలితం తన కనుకూలంగా మలుచుకునితీరాలని నిశ్చ యించుకున్నాడు. మహామహులు కొందరు తమ జాతక ఫలితాలు మార్చుకో గలిగినప్పుడు తానుమాత్రం ఆవిధంగా ఎందుకు ప్రయ త్నించకూడదని అతని కొక దృఢ నిశ్చయం కలిగింది. కాని కుమా రుని మృత్యుముఖంనుండి సంరక్షించుకోలేకపోయినందువల్ల తన ప్రయత్నా లెంతవరకు ఫలించగలవో అని చక్రవర్తి అంతర్యంలో కొంత సందేహం కలగకపోలేదు. కాని అచంచల దీక్షతో తన సంకల్పం నెరవేర్చుకునితీరాలని నిశ్చయించుకున్నాడు.

సార్వభౌముని ఏకైక పుత్రిక అనంగలేఖ కప్పటికి పద్దెనిమిది ఏళ్ళు నిండి, పందొమ్మిదవ ఏడు దాటిపోవచ్చింది. ఆమె నెవరయినా రాజవంశీయునికిగాని, క్షత్రియునికిగాని ఇచ్చి వివాహం చేసిన పక్షంలో తన కిక వేరు సంతతి లేకపోవడంవల్ల, ఆతడే కాశ్మీరానికి ఉత్తరాధికారి కాగలడు. దానితో తన గోనందవంశం విచ్ఛిన్నమయిపోగలదు. అందువల్ల బాలాదిత్య చక్రవర్తి రాజంశీ యునికిగాని, చిట్టచివరికి క్షత్రియునికిగాని అనంగలేఖ నిచ్చి వివాహం చెయ్యదలచుకోలేదు.

ఆపైన తన బంధువులలో ఎక్కడనయినా అన్వేషించి. గోనందవంశీయుడ యిన కుమారుణ్ణి ఎవరినయినా దత్తపుత్రుడుగా స్వీకరించాలనికూడా నిర్ణయించుకున్నాడు.

ఆ విధంగా దత్తపుత్రస్వీకారం పట్టమహిషికిగాని రాజబంధు వులకుగాని బొత్తిగా రుచించలేదు. అనంగలేఖ నెవ్వరికయినా ఇరుగు పొరుగు రాజవంశీయునికిచ్చి,చక్రవర్తి అనంతరం సామ్రాజ్యాధికారం యావత్తు అతని కైవసమయ్యేటట్టు ఏర్పాటు చెయ్యాలని పట్టపురాణి

సంకల్పించుకున్నది. గోనందవంశం చక్రవర్తితో విచ్ఛిన్నమయితే మాత్రం వచ్చే ప్రమాద మేమిఉన్నది? దైవ సంకల్పమే ఆ విధంగా మళుపు తిరుగుతున్నప్పుడు మానవమాత్రు లేమిచెయ్యగలరని ఆమె ఆలోచన.

కాని తనతో గోనందవంశం పరిసమాప్తమయి పోవడం బాలా దిత్యుని కెంతమాత్రము సరిపడలేదు. 'ఏది ఏమయినాసరే, అనంగలేఖ నెవ్వరికయినా సాధారణ వ్యక్తి కిచ్చి వివాహం చేసితీరాలి! గోనంద వంశంలో జన్మించిన జ్ఞాతి నెవ్వరినయినా దత్తపుత్రుడుగా స్వీకరించి తీరాలి! మేధావి జోస్యానికి, దానితోబాటు దైవానికి ఎదురొడ్డి నిలిచి దానిని వమ్ముచేసితీరాలి!' బాలాదిత్యుని సంకల్పా లా విధంగా కొన సాగిపోయాయి.

ఆ ప్రాచీన కాలంలో కాశ్మీరంలో వర్ణాంతర వివాహా లంత విడ్డూరాలుగా ఎవ్వరు భావించలేదు! అంతకుమునుపు క్షత్రియ వంశంలో జన్మించిన మహిళలు కొందరు కాశ్మీర పట్టమహిషు లయి నారు. వారికి జన్మించిన కుమారులే కాశ్మీర సామ్రాజ్యాని కుత్తరాధి కారులయినారు. అదేవిధంగా కాశ్మీర రాజ కన్యకలను కొందరి నంతకుమునుపు క్షత్రియులు కానివారి కిచ్చి వివాహాలు జరిపించడం జరిగింది. అయితే అటువంటి సంఘటన లెప్పుడో సకృత్తుగాగాని జరగలేదు. అందువల్ల రాజబంధువులకుగాని, పట్టమహిషికిగాని ఆ నిర్ణయ మేమాత్రము ఆనందదాయకం కాలేదు. కాని కాశ్మీర సార్వ భౌముని సంకల్పానికి అడ్డుచెప్పడాని కెవ్వరికి గుండెలున్నాయి!

అందుచేత మరి తిరుగులేని దృఢనిశ్చయంతో దుర్లభవర్ధను డన్న ఒక ప్రముఖ రాజోద్యోగికి తన కుమార్తె నిచ్చి వివాహం జరి పించాలని చక్రవర్తి నిశ్చయించుకున్నాడు. ఆ ఉద్యోగి శ్రీనగరంలో అశ్వఘాస శాఖ కంతటికి అధిపతి. అశ్వఘాస శాఖ అంటే కాశ్మీర సైన్యంలో మేలిజాతి గుర్రాలకు పసిరిపచ్చిక చివుళ్ళతోబాటు మిగిలిన ఆహారపదార్థాలు సమకూర్చే వ్యవస్థ. దుర్లభవర్ధనుడు దాని కంతటికి అధిపతి. అయినా చక్రవర్తితో సరిపోల్చినప్పుడు అతడు పట్టి నిర్ధ నుడే అనాలి. అయినా రాజు తలుచుకుంటే దెబ్బలకేకొదు, ఐశ్వ

ర్యాని కేమీ కొదవ! వేగులవారి పరిశీలనవల్ల అతడు రాజవంశీయుడు కాని, సుక్షత్రియుడుగాని కాడని సుస్పష్టంగా తేలిపోయింది. పైగా అత డొక జాతి కాయస్థుడు. ఆకాలంలో ఆదాయ వ్యయాల లెక్కలు వ్రాసే కొందరు లేఖకులకు కాయస్థు లన్న పే రేర్పడింది. పైగా అత డంతగా ఉత్తమ కులీనుడుకూడా కాడు. కనకనే చక్రవర్తి కన్ను అతనిపై పడింది.

సార్వభౌముని కతనిపై ఆదరాభిమానాలు కలగడానికి ఇంకా ఒకటి రెండు సుగుణాలు కూడా కలిసివచ్చాయి. దుర్లభవర్ధనుడు మిక్కిలి బలిష్ఠశరీరుడు. అంతేకాదు, అత డెంతో అందగాడు! అనంగలేఖ మిక్కిలి సౌందర్యవతి. ఆ కారణంవల్ల దుర్లభవర్ధనునితో వివాహానికి ఆమె కొంత ఉవ్విళ్ళూరుతున్నదని చక్రవర్తి గ్రహించు కున్నాడు కనక అతనికే తన కుమార్తె నిచ్చి వివాహం చెయ్యాలని కూడా సంకల్పించుకున్నాడు. కాని అతడు క్షత్రియవంశీయుడుకూడా కాకపోవడంవల్ల పట్టమహిషి కాతనిపై ఏమాత్రము సుముఖత కలగ లేదు. కాని కాదుకూడదని సార్వభౌముడంతగా భీష్మించుకుని కూర్చు న్నప్పుడు పట్టపురాణిమాత్రం ఏమి చెయ్యగలదు? అనంగలేఖ ఆంతర్యం గ్రహించి, పోనీ గుడ్డిలో మెల్ల అనుకుని ఆ వివాహానికి అర్ధాంగీకారం వెల్లడించింది. మరికొన్ని దివసాలలోనే అనంగలేఖా దుర్లభవర్ధనుల కిరువురికి దేవేంద్ర వైభవంతో యథావిధిగా కళ్యాణ మహోత్సవం జరిగిపోయింది.

ఇక బాలాదిత్యుని మనస్సులో ఒకే ఒక సంకల్పం మిగిలి పోయింది. అది దత్తపుత్ర స్వీకరణ. దానివిషయమై అత డొక్క నిమిషమయినా ఆలసించ దలుచుకోలేదు. చారు లనేకులవల్ల సుని శిత పరిశీలన జరిపించి, ఒక గోనందవంశ బంధువు కుమారుడు శాత్రవకేసరిని దత్తపుత్రుడుగా స్వీకరించి సామ్రాజ్యాని కుత్తరాధి కారిగా యువసార్వభౌమ పదవిలో అభిషేకించవలెనని సంకల్పించు కున్నాడు. అతనికప్పటికింకా ఇరవై ఏళ్ళ ప్రాయమయినా నిండలేదు. అయినా అనేక యుద్ధాలలో మహాపరాక్రమశాలి అన్న ఘన బిరుదం గడించుకున్నాడు. అందువల్ల తన అనంతరం కాశ్మీర సామ్రాజ్యం

చెదరకుండా సంరక్షించగలడన్న గట్టి ధైర్యం కాశ్మీర చక్రవర్తి హృదయంలో స్థిరపడింది.

అయితే దత్తస్వీకార శుభముహూర్తం నిర్ణయించేవరకు ఆ వ్యవహారం బంధువులకేకాక, చిట్టచివరికి తన కెంతో ఆత్మీయుడు, వృద్ధమంత్రి దేవశర్మకు కూడా తెలియనియ్యరాదని చక్రవర్తి కొక ఆలోచన కలిగింది. అప్పటి కతనికి తన దృఢసంకల్పంతో, నిరంతర ప్రయత్న శక్తితో, పౌరుష ప్రాభవంతో ఆ దైవానికే ఎదురొడ్డి నిలిచి జేగీయమానంగా జయించగలిగానన్న సంపూర్ణ సంతృప్తి కలిగింది. ఆపైన మరికొన్నాళ్ళలోనే మేధావిని తన కొలువుకూటానికి పిలిపించి ఆతడు చెప్పిన జోస్యం పూర్తిగా తప్పిపోయిందని కవ్వించి ఓటమి ఒప్పించాలనికూడా ఉత్కంఠ కలిగింది.

*        *        *

ఆ విధంగా స్వశక్తివల్ల గోనందవంశం నిరంతరాయంగా తామరతంపరగా వర్ధిల్లడానికి ప్రయత్నించి చాలావరకు విజయం సాధించినా, చక్రవర్తి అంతరాంతరంలో ఎక్కడో కొంచెం సంశయం పట్టుకుని కళుక్కుమని వేధించకపోలేదు. అదే మథనతో ఆ మరునాడే మేధావిని తన కొలువుకూటానికి పిలిపించాడు.

బాలాదిత్య చక్రవర్తి కలకల నవ్వుతున్న ముఖంతో ఆనాటి సభామందిరంలో ప్రవేశించగానే దేవశర్మతోబాటు మేధావి దిగ్గున లేచి నిలిచి సార్వభౌముని కత్యంత వినయంతో నమస్కరించి దోసిలికట్టి నిలుచున్నాడు. అతని ముఖవైఖరి పూర్తిగా ఓటమి అంగీకరిస్తున్నట్టున్నదని సార్వభౌమ దేవశర్మ లిరువురికి క్షణంలో స్ఫురించింది. అటుపిమ్మట వృద్ధమంత్రి నెమ్మదిగా లేచి నిలిచి, మేధావివైపు చూచి, రవంత వెటకారంగా నవ్వి అధిక్షేప గర్భిత స్వరంతో ప్రశ్నించాడు.

"రాకుమారి అనంగలేఖాదేవి కల్యాణ మహోత్సవానికి విచ్చేసి మీరు సార్వభౌముల సగౌరవ బహూకృతి అందుకున్నారు గదా! ఇక చక్రవర్తి త్వరలోనే గోనందవంశీయుడయిన ఒక దత్తపుత్రుణ్ణి స్వీకరించి, యువరాజు పట్టాభిషేకం జరిపించవలెనని నిశ్చయించు

కున్నారు. దానికిక శుభముహూర్త నిర్ణయం ఒక్కటే తరవాయి. మరి మీరు సార్వభౌముల అనంతరం సామ్రాజ్యం వేరొక రాజవంశీయుల కైవసం కాగలదని అన్నారే మరి చక్రవర్తి జామాత దుర్లభవర్ధనులు సుక్షత్రియ వంశీయులుకూడా కాదుగదా? మీ జోస్యం పూర్తిగా తప్పిపోయినట్టే కదా? ఇప్పుడేమంటారు?"

ఆ ప్రశ్నతో సార్వభౌముని కిరువైపుల నిలిచి వింజామరలు వీస్తున్న చామర గ్రాహిణుల కిరువురికి ముచ్చెమటలు పోశాయి; వారి కరకంకణాల మనోజ్ఞ రవం క్షణకాలం మందగించింది. వింజామరల వేగం రవంత క్షీణించింది. ఇక మేధావి కేదో గొప్ప అవమానం జరగగలదని వారిద్దరు మిక్కిలి ఆందోళనపడ్డారు.

కాని అతని ముఖంలో ఎక్కడ పరాజయచ్ఛాయ కానరాలేదు; పైగా గాంభీర్యంతో మేళవించిన అహంకారావేశం హుమ్మని హుంకరించింది. అయినా అతికష్టంమీద తెచ్చిపెట్టుకున్న అణకువతో కాశ్మీరాధిపతికి దోసిలికట్టి విన్నవించాడు.

"మహాప్రభూ! ఇంతవరకు దైవశక్తికెదురొడ్డి నిలిచి కేవలం పౌరుషశక్తితోనే ప్రయత్నించి తామనేకవిధాల కృతకృత్యు లయినారు; కాదనడంలేదు; రాకుమారిని ఒక సామాన్యుని కిచ్చి వివాహం జరిపించి, ఆపైన గోనందవంశీయుని దత్తపుత్ర గౌరవం ప్రసాదించవలెనని సంకల్పించుకున్నారు. అయితే ఇక ముమ్ముందు జరగబోయేదిమాత్రం మీ చేదోయినుండి ఇంతకుమునుపే దాటిపోయింది;"

"అంటే?"

ప్రశ్నించాడు దేవశర్మ. నిలువునా నిర్ఘాంతపడి. అదేక్షణంలో చక్రవర్తి నుదుటిపై తీవ్రమయిన బొమముడి విరిగింది. మేధావి సార్వభౌమునివైపు చూచి మంద్ర గభీర స్వరంతో తానన్న మాటల కంతరార్థం వివరించాడు.

"తామనుకున్నట్టు దుర్లభవర్ధనులు కేవలం కాయస్థ కులస్థులు కానేకారు; వారి గృహంలో శయన మందిరంలో ఆగ్నేయదిశలో నిలువులోతున బంగారు కలశంలో ఒక నిధి ఉన్నది; వేయిన్నూటపదారు బంగారు నాణేలతోపాటు రాగిరేకులపై వారి వంశవృక్ష పట్టిక

సవిస్తరంగా దానిలో లిఖించబడి ఉన్నది! దానినిబట్టి ఆయన సుప్ర సిద్ధ కర్కోటక నాగవంశీయులేకాక, సుక్షత్రియ కులీనులనికూడా సుస్పష్టంకాగలదు! ఇదేక్షణంలో అచ్చటికెవ్వరినయినా పంపించి, ఆ నిధి వెలువరింపజేసి, ఆ వంశవృక్ష పట్టిక తామే స్వయంగా పరిశీలించవచ్చును. నా ఈ మాట తప్పిపోయినఎడల తా మెటువంటి శిక్ష విధించినా నేను శిరసావహించగలను!"

ఆ ప్రతిసమాధానంతో బాలాదిత్యుని శిరస్సుపై పెనుపిడుగు విరుచుకుపడినట్టయింది! అయినా నిగ్రహించుకున్నాడు. మేధావి గభీర కంఠస్వరాన్నిబట్టి ఆతని భవిష్యద్వాణి అక్షరాల ఫలించగలదన్న నమ్మికకూడా చక్రవర్తికప్పటికి కలిగింది. వెనువెంటనే రాజదూత నొకణ్ణి పంపించి, "ఆ పాతు శీఘ్రంగా వెలువరింపజేయించి తన సన్నిధికి పంపించవలసిన"దని దుర్లభవర్ధనుని కాదేశించాడు. అయినా చక్రవర్తికి తన ప్రయత్నంపై విశ్వాసం సడలలేదు. తిరిగి మేధావిని పరీక్షించాడు.

"అయితే మేము దత్తులుగా ఎన్నుకున్న రాజకుమారుని పేరేమో చెప్పగలరా?"

మేధావి అయిదారు నిమిషాలపా టాలోచించి వేళ్లు మడిచాడు.

"శాత్రవకేసరి!"

చక్రవర్తి ఆత్మధైర్యానికి ఆ ప్రత్యుత్తరంతో తీవ్రమయిన ఆఘాతం తగిలింది! 'తన కొక్కనికి మాత్రమే తెలిసిన ఆ గోనంద వంశీయుని పేరు మేధావి కెలాగ అవగతమయినదా? అని క్షణకాలం దిగ్భ్రాంతుడయినాడు. అయినా అచంచల ధైర్యంతో తన దృఢదీక్ష వెల్లడించాడు.

"ఇన్నివిధాల మీ జోస్యం ఫలిస్తున్నా, నే నెలాగయినా దైవంతో పోరాడాలనే నిశ్చయించుకున్నాను. త్వరలోనే నేను శాత్రవకేసరికే యువరాజ పట్టాభిషేకం జరిపించితీరగలను! ఈ నిర్ణయానికి మరి తిరుగు లేదు!"

మేధావి కంఠస్వరం తిరిగి ఖంగుమని మారుమోగింది.

"కాశ్మీరాధీశ్వరా! ఈ వ్యవహారంలోకూడా మీ నిర్ణయమే

తప్పక ఫలించగలదు. ఇంతేకాదు. మీరు జీవించి ఉన్నంతకాలము కాశ్మీరం మీ గోనందవంశం చల్లని ఏలుబడిలోనే వర్ధిల్లగలదు! కాని అటుపిమ్మట కర్కోటక నాగవంశీయులు దుర్లభవర్ధనులే సామ్రాజ్యాధికారులు కాగలరు! మీ అనంతరం కొంతకాలం సామ్రాజ్యంలో ఏర్పడే అల్లకల్లోలాలవల్ల శాత్రవకేసరి సింహాసనంపై పట్టాభిషిక్తులు కాకుండానే పరాజితులై దూరదూరంగా తొలగి పోగలరు! ఇది ముమ్మాటికి యథార్థమై అక్షరాల జరిగితీరగలదు!"

ఆ ప్రసంగంతో బాలాదిత్య సార్వభౌమునికి నాలుగయిదు క్షణాలవరకు మరి ఊపిరే ఆడలేదు. అయినా రవంతసే పాలోచించి కలకల నవ్వి ప్రశ్నించాడు.

"అయితే నే నిప్పు డేమని ఆలోచిస్తున్నాను?"

"నా భవిష్యద్వాణి నెలాగయినా తప్పిపోయేటట్టు చెయ్యాలని దృఢంగా నిశ్చయించుకున్నారు! అదే ఆలోచనతో త్వరలోనే శాత్రవ కేసరిని యువరాజ పదవిలో అభిషేకించి తీరాలని నిశ్చయించుకున్నారు!"

చక్రవర్తికా ప్రత్యుత్తరం పరమాశ్చర్యం కలిగించింది. 'సరిగా నే నాలోచిస్తున్నది ఎలాగ తెలిసింది మేధావికి?' అని తనలో తా నాశ్చర్యపడ్డాడు! అయినా తిరిగి పరీక్షించాడు.

"మీ ఫలితం యథార్థమే! అయితే తిరిగి నే నీ క్షణంలో ఏమని ఆలోచిస్తున్నాను?"

"చక్రవర్తీ! ఇప్పటికి నా జ్యోతిషంమీద మీకు కొంత గట్టి నమ్మకమే కలిగింది! కనుకనే నన్ను మీ ఆస్థాన జ్యోతిషవిద్వాంసుడుగా నియమించవలెనని ఆలోచిస్తున్నారు. కాని వారణాసికి పోయిన నాగేశ్వర భట్టారకులను తిరిగి పిలిపించి మీ ఆస్థాన విద్వాంసులుగా గౌరవించవలసిందని నా ప్రార్థన."

"మరి మీ మాట?"

తటాలున దేవశర్మ కల్పించుకుని ప్రశ్నించాడు.

"నన్ను దుర్లభవర్ధనులు తమ ఆస్థాన విద్వాంసులుగా నియమించుకోగలరు! నేను జ్యోతిష శాస్త్రానికి గౌరవం కలిగించడం కోసమే తమ దర్శనం చేసుకున్నాను. అదీగాక నా జాతక ఫలితం కూడా ముమ్మందే యోగదాయకంగా ఉన్నది. కనక నా కోరిక మన్నించవలిసిందని ప్రార్థన."

ఆ సమాధానంతో చక్రవర్తికి మేధావిపై ఇను మిక్కిలిగా గౌరవం కలిగింది. అంతలోనే దుర్లభవర్ధనుని భవనంలోనుండి నిధి వెలువరించిన రాజదూత ఆతని వంశవృక్ష పట్టికతో, బంగారు కలశంతో, వేయిన్నూటపదారు పైడిదీనారాలతో చక్రవర్తి సమక్షానికి వచ్చి అవి సవినయంగా సమర్పించాడు. ఆ వంశవృక్ష పట్టిక మేధావి జోస్యం అక్షరాల యథార్థమని ఋజువుపరిచింది.

దానితో బాలాదిత్య సార్వభౌమునికి మేధావి భవిష్యద్వాణి తప్పక ఫలించి తీరగలదన్న దృఢ నిశ్చయం కలిగింది. అందుచేత ఆతని ప్రార్థన ప్రకారం నాగేశ్వరభట్టారకుని తిరిగి తన ఆస్థాన విద్వాంసుడుగా నియమించడాని కంగీకరించాడు. అయితే మేధావిని శ్రీనగరంలో స్థిరపడిపోవలిసిందని సగౌరవంగా ప్రార్థించాడు. ఆ విద్వాంసునికి దాని కంగీకరించక తప్పలేదు. అంతలోనే బాలాదిత్య సార్వభౌముని కంఠం మేఘ గంభీరస్వరంతో ప్రతిధ్వనించింది.

"ఇన్ని ప్రబల నిదర్శనాలు గోచరించిన పిమ్మట మీ జ్యోతిష విద్యా పాటవం కాదనగల శక్తి నాకు లేదు! అయినా మానవులు తమ భవిష్యత్తు మలుచుకోవడంలో సర్వ స్వతంత్రులని మీరే అన్నారుకదా! కాని దైవశక్తి తోడ్పాటులేనప్పుడు మానవప్రయత్నం ఫలించకపోవచ్చుననికూడా నాకు తెలియకపోలేదు. ఇలాగే పురుషప్రయత్నం లేనప్పుడు దైవం ఎంతగా ప్రబలమయినా తోడ్పడజాలదు. కనక మీ జ్యోతిషం మీద నా కెంతటి గౌరవం కలిగినా, ఈ మాసంలోనే శాత్రవకేసరిని దత్తపుత్రుడుగా స్వీకరించి యువరాజ పట్టాభిషేకం జరిపిస్తున్నాను."

మేధావి ముఖం దరహసితంతో కలకలలాడింది.

"సార్వభౌమా! ఇలాగ జరిగి తీరగలదని నే నిదివరకే విన్నవించాను గదా! ఇది జ్యోతిషశాస్త్రానికే అఖండ విజయమని భావిస్తున్నాను. అదిన్నీగాక అంతా దైవ నిర్ణయమే అని చేతులు ముడుచుకుని కూర్చోవలిసిందని జ్యోతిషశాస్త్ర మెన్నడు ఆదేశించ లేదు. అయితే ఫలసిద్ధికి దైవానుకూలం సూచించే గ్రహానుకూలత కూడా ఉండాలనిమాత్రమే నిర్దేశించింది. ఇందుచేత ఈ నిర్ణయంలో మీ మేరుధీరత కిదే నా నమస్కృతి! సర్వదా మీకు శుభం చేకూరవలె వని, నా జోస్యం ఫలింప జెయ్యవలిసిందని మనసారా ఆ గ్రహాధి పతి ఆదిత్య దేవునికి నమస్కరిస్తున్నాను."

మరి కొంతసేపటికి ఆ సమావేశం ముగిసింది.

మేధావి జోస్యం ఫలించితీరగలదని త్రికరణ శుద్ధిగా విశ్వ సించినా, బాలాదిత్య సార్వభౌముడు పురుష ప్రయత్నంపై అంత కన్న ఇనుమడించిన నమ్మికతో అదే మాసంలో శాత్రవకేసరిని దత్త కుమారుడుగా స్వీకరించాడు. యువరాజ పట్టాభిషేక మహోత్సవంలో కాశ్మీరానికి తిరిగి పిలిపించిన నాగేశ్వరభట్టారకు డాదిగా గల జ్యోతిష శాస్త్ర విద్వాంసుల సమక్షంలో మేధావిని స్వయంగా నిర్వర్తించిన స్వర్ణదీనారాల అభిషేకంతో గౌరవించి తన పరిపూర్ణౌదార్యం వ్యక్తీ కరించాడు. కాని మరికొంత కాలానికి మేధావి జోస్యం అక్షరాల ఫలించింది!